క్లుప్తంగా

నేడు విశ్వకర్మ జయంతి వేడుకలు

భట్టిప్రోలు: ఏపీ కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలులో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విశ్వకర్మ పూజ అనేది ప్రపంచ రూపకర్తగా పరిగణించబడే విశ్వకర్మకు అంకితం చేయబడినట్లు పేర్కొన్నారు. విశ్వకర్మ అనేక ఆయుధాలను కూడా సృష్టించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న చేతివృత్తుల వారికి ఒక ముఖ్యమైన పర్వదినమని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం ప్రారంభం



అమర్తలూరు(వేమూరు): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రం చేయాల్సిన బాధ్యత విద్యార్థులు, ఉపాధ్యాయులపై ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాంచారయ్య తెలిపారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని పాఠశాలను శుభ్రం చేశారు.

క్వాష్ జిల్లా జట్టుకు హైవెండ్ విద్యార్థులు



కర్లపాలెం: జిల్లా స్థాయిలో జరిగిన క్వాష్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని హైవెండ్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు బత్తుల వీరశేఖర్ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపిన వివరాల మేరకు గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో మంగళవారం జరిగిన క్వాష్ ఆటల పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు అండర్-14 బాలికల విభాగంలో చందన, వర్షిత, స్వర్ణలత, అమృతవర్షిణి, అండర్-17 విభాగంలో గీతిక, శ్రావణి, అక్షయ, శ్రీలక్ష్మి, అండర్-14 బాలుర విభాగంలో వివేక్, అభినవ్, అరుణ్, కిషోర్, అండర్-17 విభాగంలో శ్రీహర్షవర్ధన్ ప్రతిభచూపి క్వాష్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. త్వరలో కాకినాడలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో జిల్లా జట్టు తరపున తమ విద్యార్థులు ఆడతారని అన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను హైవెండ్ హైస్కూల్ అధినేత పి.ఉదయ్‌చంద్రరావు, డైరెక్టర్‌లు సాయి మహేంద్రబాబు, చాందినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ



అమర్తలూరు(వేమూరు): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెళ్లే రోడ్డు పక్కన గ్రామంలోని వ్యర్థాలు వేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అమర్తలూరు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని వ్యర్థాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోడ్డు పక్కన వేస్తున్నారు. దీంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటోందని అంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆ వ్యర్థాలు తడిసి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాల వల్ల జ్వరాలు అధికంగా ఉన్నాయి. దీనికి తోడు పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దోమలు వృద్ధి చెంది డెంగీ వంటి జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై చర్యలు తీసుకుని, రోడ్డు పక్కన చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని వల్లభాపురం సమీపంలోని కృష్ణానది కరకట్టపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం గ్రామానికి చెందిన బత్తు సుశీల విజయవాడ నుంచి అంబులెన్స్‌లో కరకట్ట మీదుగా వస్తున్నారు. అయితే కొల్లిపర నుంచి విజయవాడకు వెళుతున్న కారు అతి వేగంగా అంబులెన్స్‌ను ఢీ కొట్టింది. రెండు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మహిళకు తీవ్రగాయాలవటంతో 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటేశ్వరరావు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలువలు ఇలా...

సాగు సాగేదెలా..?!



బలిజేపల్లి నంబరు-1 పంట కాలువ

- అధ్వాన పరిస్థితుల్లో పంట కాలువలు
- పట్టించుకోని అధికారులు
- పంటలు మునిగిపోతాయని ఆవేదనలో రైతులు



భట్టిప్రోలులో మురుగు కాలువల్లో గుర్రపుడెక్క

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో పంట కాలువలు, మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. మురుగు కాలువలు, పంట కాలువల్లో తూటికాడ అధికంగా ఉండటంతో నీటి పారుదల నిలిచిపోయి పంట పొలాలు మునిగిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కాలువలు నీటి సంఘాలకు అప్పగించడం వల్ల అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో పంట కాలువ చాలా అధ్వానంగా మారింది. నియోజకవర్గంలో గత నాలుగు ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల నీటి పారుదల నిలిచిపోవడంతో పంట పొలాలు దెబ్బతింటాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. నీటి సంఘాల అధ్యక్షులు పంట కాలువల గురించి పట్టించుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గత నెలలో మునిగిన పంటలు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పంట పొలాలు దెబ్బతినకుండా ఉండేందుకు కాలువల్లో గుర్రపుడెక్క, తూటికాడ తొలగించాలని ఆగస్టు నెలలో భట్టిప్రోలు మండలంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో డ్రైనేజీ అధికారులు భట్టిప్రోలు మండల కేంద్రంలోని మురుగు కాలువల్లో తూటికాడ, గుర్రపుడెక్క తొలగించే పనులు చేపట్టారు. కానీ ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు పనులు నిలిపివేశారు. దీంతో భట్టిప్రోలు మండల కేంద్రంలోని మురుగు కాలువలు, పంట కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోయి అధ్వానంగా తయారయింది. అంతేకాక ఆగస్టులో కురిసిన వర్షాలకు మురుగు నీరు పారుదల నిలిచిపోవడంతో పంట పొలాలు మునిగిపోయాయని రైతులు చెబుతున్నారు. ఇలా అయితే సాగు చేసేది ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

+ ప్రస్తుతం మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో పంట పొలాలు మునిగిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు వల్ల పంట పొలాలు మునిగిపోతే ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధ్యత వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు పంట కాలువలపై దృష్టి సారించి, నీటి పారుదలకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



వేమూరు నుంచి బలిజేపల్లి, అబ్బనగూడవల్లి వరకు వెళ్లే నంబర్-1 పంట కాలువ చాలా అధ్వానంగా ఉంది. కాలువలో తూటికాడ పేరుకుపోవడంతో నీటి పారుదల నిలిచిపోయింది. వర్షాల వల్ల నీరు ఎక్కువై పంట పొలాలు దెబ్బతినే అవకాశం ఉంది. పంట కాలువల గురించి ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవాలి.

– రాయపూడి బుజ్జిబాబు, రైతు, బలిజేపల్లి

3 వేల ఎకరాలు మునిగే పరిస్థితి



భట్టిప్రోలు మండల కేంద్రంలోని మురుగు కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోయాయి. దీంతో నీటి పారుదల నిలిచిపోయింది. 3 వేల ఎకరాలలో పంట పొలాలు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ అధికారులు గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి .

– మాగంటి రామస్వామి, రైతు, భట్టిప్రోలు

పార్టీలో కష్టపడే వారికి తగిన గౌరవం

వైఎస్సార్‌సీపీ రేపల్లె, వేమూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు డాక్టర్ ఈవూరు గణేష్, వరికూటి అశోక్‌బాబు



మదన్‌మోహన్‌ను సత్కరిస్తున్న డాక్టర్ గణేష్, అశోక్‌బాబు నాయకులు

చెరుకుపల్లి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంతో పార్టీ కోసం కష్టపడుతున్న వారికి వైఎస్సార్‌సీపీలో తగిన గౌరవం దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె, వేమూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు డాక్టర్ ఈవూరు గణేష్, వరికూటి అశోక్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని గుళ్ళపల్లి డాక్టర్ ఈవూరు గణేష్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల పరిశీలకుడిగా నూతనంగా నియమితులైన యార్లగడ్డ మదన్‌మోహన్ మర్యాదపూర్వకంగా కలసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన మదన్‌మోహన్‌ను డాక్టర్ ఈవూరు గణేష్, వరికూటి అశోక్‌బాబు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మదన్‌మోహన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవులను నాకు ఇచ్చిన పార్టీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జునకు, డాక్టర్ ఈవూరు గణేష్, వరికూటి అశోక్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పార్టీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ తన మీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మదన్‌మోహన్ చెప్పారు. కార్యక్రమంలో రేపల్లె పట్టణ కన్వీనర్ శేషగిరి, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకట కృష్ణారెడ్డి, శివ, శేషు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్



మాట్లాడుతున్న ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

బాపట్లటౌన్: పోలీస్ అధికారులు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఎన్‌డీపీఎస్ చట్టాలు, వాటి అమలుపై పోలీస్ సిబ్బందికి ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని, వాటిని జిల్లాలో పూర్తి స్థాయిలో కట్టడి చెయ్యాలన్నారు. అధికారులకు చట్టపరమైన విధానాలు, ప్రొసీజర్లపై క్లాసులు నిర్వహించడమే కాకుండా, ప్రాక్టికల్ డెమో ద్వారా పూర్తి అవగాహన కల్పించారు. జిల్లాలోని 100 మంది పోలీసు సిబ్బందికి చట్టాల అమలులో సమగ్ర పరిజ్ఞానం పెంపొందించడం జరిగిందన్నారు. ఎస్‌బీ సీఐ జి.నారాయణ, పట్టణ సీఐ ఎం.రాంబాబు, డీసీఆర్‌బీ సీఐ ఎం.శ్రీనివాసరావు, జిల్లాలోని ఎస్ఐలు, పోలీస్‌స్టేషన్‌లో ని రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రైతులకు నానో డీఏపీపై అవగాహన



మోపర్రు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో హేమంత్ భరత్‌కుమార్



పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో ఫారూఖ్



పోతుమర్రు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ప్రేమ్‌సాగర్

అమర్తలూరు(వేమూరు): రైతులు వరి పైరుకు నానో డీఏపీ వాడాలని మండల వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని కోడితాడిపర్రు, మోపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతులకు నానో డీఏపీ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా నైట్రోజన్ వినియోగ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందన్నారు. మొక్కల పెరుగుదల ధారాళమైన దిగుబడి నాణ్యతను మెరుగుపరుస్తుందన్నారు. సాధారణ యూరియాపై ఆధారపడడాన్ని తగ్గించితే ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. కావున రైతులు నానో యూరియా, డీఏపీ వాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.మణికంఠ, బి.నరేంద్ర, భాస్కర్, వ్యవసాయ సహాయకులు ప్రవల్లిక, రైతులు పాల్గొన్నారు.

వరి రైతులు 30లోగా పంట నమోదు చేసుకోవాలి

చెరుకుపల్లి: మండలంలో వరి సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ నెల 30వ తేదీ లోపు గ్రామంలోని రైతు సేవా కేంద్రాల వద్ద పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూఖ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కావూరు, ఆరుంబాక గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు సలహాలు చేశారు. పంట నమోదు చేసుకోవటం ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే అన్ని రాయితీలు వస్తాయన్నారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లోని రైతులకు నానో యూరియా, వరి పంటలో సమర్థవంతమైన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ఏఈవోలు, వీఏఏలు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోతుమర్రులో 'పొలం పిలుస్తోంది'

వేమూరు: రైతులందరు నానో యూరియా వాడటం వల్ల మొక్క పెరుగుదల అధికంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు. మండలంలోని పోతుమర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా 80 శాతం నుంచి 90 శాతం వరకు వరి మొక్కల్లో ఇంకుతుందన్నారు. ఒక ఎకరానికి 500 మీల్లీ లీటర్లు పిచికారీ చేయాలన్నారు. నానో యూరియా వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించడం జరుగుతుందన్నారు. రైతులందరు నానో యూరియా వాడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది పి.రమేష్ రెడ్డి, నిభేష్, రైతులు పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం ఇన్‌చార్జ్ ఎస్ఐ అనిత

కర్లపాలెం: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శక్తి బృందం ఇన్‌చార్జ్ ఎస్ఐ అనిత చెప్పారు. మంగళవారం పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ అనిత మాట్లాడుతూ బాలికలు శక్తి యాప్ గురించి అవగాహన కలిగి ఉండటంతో పాటు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్ బ్యాడ్, గుడ్ టచ్ వంటి అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర సమయాలలో వినియోగించ గల టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1091, 1098, 181, 1930 ఆవశ్యకతను వివరించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి పారిపోయిన బాలుడు తల్లి చెంతకు



బాలుడిని తల్లికి అప్పగించిన ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు

బాపట్లటౌన్: తల్లితో గొడవపడి ఇంటి నుంచి పారిపోయిన బాలుడిని తిరిగి తల్లికి అప్పగించిన ఘటన బాపట్లలో చోటు చేసుకుంది. రాజమండ్రికి చెందిన 14 సంవత్సరాల బాలుడు ఉదయం సమయంలో బాపట్ల రైల్వే స్టేషన్‌లో సంచరిస్తుండగా రైల్వే పోలీసులు గుర్తించి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులకు సమాచారం అందించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి పురుషోత్తమరావు, బాలల రక్షణ అధికారి జి.కృష్ణ, సిఫార్డ్ కో ఆర్డినేటర్ బడుగు కిషోర్ ఆ బాలుడిని విచారించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ గుంటూరు అధికారులకు సమాచారం అందించారు. అధికారులు బాలుడి తల్లికి సమాచారం అందించి ఆమెను బాపట్లకు పిలిపించి బాలుడిని అప్పగించారు. బాలుడిని సురక్షితంగా అప్పగించినందుకు బాలుడి తల్లి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం



అమర్తలూరు(వేమూరు): శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెక్రెడ్ హార్ట్స్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజనల్ స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



జంపనిలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన పంచాయతీ కార్మికులు

జంపని(వేమూరు): పీడీఎస్ రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండటానికి స్మార్ట్ రేషన్ కార్డుల విధానం తీసుకొని రావడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూర్ కోడ్ ఆధారిత సాంకేతికతతో స్మార్ట్ రేషన్ కార్డులు రూపొందించబడ్డాయని, వీటి సహాయంతో రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందవచ్చన్నారు. ఈ స్మార్ట్ కార్డులతో వేలి ముద్రలు పని చేయని సందర్భంలోనూ స్కాన్ లేదా స్వైప్ ద్వారా రేషన్ పొందే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ పూర్ణకుమారి, వెంకట సుబ్బయ్య, విజయబాబు, రవిప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వినతి

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును కార్మికులు కోరారు. జంపని గ్రామంలో ఆయనను కలిసి వినతపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి.అగస్టీన్ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుకూలంగా పంచాయతీ కార్మికులకు రూ.21 వేల వేతనం అందించాలని ఆయన కోరారు. గ్రీన్ అంబాసిడర్‌లకు ఆక్యుపేషన్ హెల్త్ అలవెన్స్ రూ.4 వేలు కలిపి రూ.10 వేలు ఇప్పించాలన్నారు. పంచాయతీ కార్మికులకు ఇచ్చిన జీవోలు 132, 142, 680 అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పుల్లారావు, రాంబాబు, సీహెచ్ ఏనోకు, సుబ్బయ్య పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి



మృతి చెందిన వాసు

వేమూరు: గడ్డి మందు తాగి బి.వాసు (30) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భట్టిప్రోలు మండలం కోళ్లపాలెం గ్రామానికి చెందిన బి.వాసు ఇంటి ప్రహరీ గోడను తన బాబాయి పడేయడంతో భట్టిప్రోలు పోలీసు స్టేషన్‌లో ఈ నెల 10న ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును పరిష్కరించకపోగా, వాసును తిట్టారు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 సహాయంతో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నిరుపేద కుటుంబాలకు పారదర్శకంగా సరుకులు పంపిణీ

రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి



రేపల్లె స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె(చెరుకుపల్లి): నిరుపేద కుటుంబాల వారందరికీ పారదర్శకంగా రేషన్ సరుకులు పంపిణీ చేయటమే లక్ష్యం అని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలో నిర్వహించిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యాక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో 18,006 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని వాటన్నింటిని లబ్ధిదారుల ఇళ్లకు రెండు, మూడు రోజుల్లో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది అందజేస్తారన్నారు. పంపిణీ చేసిన స్మార్ట్ కార్డుల వివరాల్లో సవరణలు ఉంటే లబ్ధిదారులు అక్టోబర్ 31వ తేదీ లోపు ఎటువంటి రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం కార్డుదారులకు టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, సీఎస్‌డీటీ ఓంకార్, మండల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుల పున్నారావు, రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరావు, డీసీ చైర్మన్ ఎంఆర్‌కే మూర్తి, పూషడపు కుమారస్వామి, రాష్ట్ర బీసీ నాయకుడు దివి రాంబాబు, తాతా ఏడుకొండలు, కందుల వెంకటేశ్వరరావు సొంటి సుబ్బయ్య, రవిచంద్రా రెడ్డి, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో...

నియోజకవర్గంలో నూతన రేషన్‌కార్డులు (స్మార్ట్‌కార్డులు) పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసి పంపిణీ చేస్తున్నారని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. మంగళవారం రేపల్లె ఎంసీఏ ఫంక్షన్ హాల్లో రేషన్ షాపు నెంబర్ 6 డీలర్ విజయలక్ష్మి పరిధిలోని వినియోగదారులకు స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులు, నాయకుల సమక్షంలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేడబ్ల్యూడీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతగాని మురళీధర రావు, రేపల్లె, నగరం, చెరుకుపల్లి, తహసీల్దార్‌లు మోర్ల శ్రీనివాసరావు, నాంచారయ్య, సీహెచ్ పద్మావతి, జనసేన రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, కూటమి నాయకులు, డీలర్లు, కార్డుదారులు పాల్గొన్నారు.